# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ:  28-10-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సౌర విద్యుత్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడవ స్థానంలో ఉందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.
- ❖ కేంద్ర మంత్రివర్గం 8వ వేతన సంఘం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.
- ❖ జాతీయ రహదారుల నిర్మాణంలో ఇప్పటివరకు 80 లక్షల టన్నుల మేర వ్యర్థ పదార్థాలను ఉపయోగించామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.
- ❖ బంగాళాఖాతంలోని మొంథా తీవ్ర తుఫాను ఈరోజు రాత్రి ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ సమీపంలో తీరందాటనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత కాలంలో ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి అత్యవసర, నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్జాతీయ సౌర కూటమి అసెంబ్లీ (ISA) 8వ సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగిస్తూ... వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి భారతదేశం కట్టుబడి ఉందని, దాని కోసం దృఢమైన చర్యలు తీసుకుంటోందన్నారు. భారత్ సహా ప్రపంచ దేశాలు సూర్యుడిని జీవశక్తికి ఆదారమైన వనరుగా గౌరవిస్తున్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ... సౌర విద్యుత్ ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద 21 లక్షల రూఫ్ టాప్ సోలార్ యూనిట్లను ఏర్పాటు చేశామని, నేడు దాదాపు 50 శాతం మందికి సున్నా విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. భారతదేశం శిలాజ ఇంధన దిగుమతులను, కాలుష్య సంబంధిత వ్యయాలను తగ్గించిందన్నారు. సౌరశక్తిని స్థిరంగా మార్చడానికి ISA కృషి చేస్తోందని కేంద్రమంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు పెంచేందుకు వీలుగా 8వ వేతన సంఘం నిబంధనలను కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. ప్రధానమంత్ర నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం న్యూఢిల్లీలో ఈరోజు జరిగింది. కేబినెట్ సమావేశం వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వివరిస్తూ.... సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజన దేశాయ్ ఛైర్‌పర్సన్‌గా 8వ వేతన సంఘం ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఈ కమిషన్ 18 నెలల్లోపు తన సిఫార్సులను అందిస్తుందన్నారు. అలాగే రబీసీజన్ కు సంబంధించి ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై పోషక ఆధారిత సబ్సిడీ రేట్లతో పాటు, 2025 రబీకాలానికి సుమారు 37 వేల 952 కోట్ల రూపాయల సబ్సిడీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ రహదారుల నిర్మాణంలో ఇప్పటివరకు 80 లక్షల టన్నుల మేర వ్యర్థ పదార్థాలను ఉపయోగించామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. `దేశంలో స్మార్ట్ రోడ్ల భవిష్యత్తు` అనే అంశంపై ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన CII సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ... రవాణా రంగంలో ఇథనాల్, మిథనాల్ వంటి జీవ ఇంధనాలను వినియోగించడం వలన లాజిస్టిక్స్ ఖర్చులు 5 నుండి 6 శాతం తగ్గాయని అన్నారు. ఈ ఖర్చులను తగ్గించడం వల్ల వాణిజ్యంతో పాటు, తలసరి ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ప్రత్యామ్నాయ జీవ ఇంధనాల వాడకం స్థిరత్వాన్ని ప్రోత్సహిస్తుందని, కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. దేశానికి మౌలిక సదుపాయాలు వెన్నెముక అని, 2027 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించడానికి, స్థిరమైన రహదారి అభివృద్ధికి ఇవి కీలకమని నితిన్ గడ్కరీ పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా మార్చడానికి దేశ పౌరులు కృషి చేయాలని ఉప రాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. ఈరోజు తమిళనాడులోని కోయంబత్తూరు సిటిజన్స్ ఫోరంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... కార్మికులు, రైతులు దేశ అభివృద్ధికి వెన్నెముక అని పేర్కొన్నారు. ఆధునీకరణతో కార్మికుల భవిష్యత్‌కు భంగం కలగదని అది పరిశ్రమవృద్ధికి దోహదపడుతుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్‌లోని లోథల్‌లో ప్రతిపాదిత నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ (NMHC) లోగోను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్... ముంబైలో జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్ 2025లో భాగంగా ఈరోజు ఆవిష్కరించారు. అలాగే NMHC పరిశోధన నివేదికను కూడా కేంద్రమంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. ఇది యువతరాన్ని సముద్ర రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రేరేపిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మొంథా తుఫాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల తూర్పు తీరం వెంబడి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ రైల్వే అధికారులను ఆదేశించారు. తుఫాను దృష్ట్యా రైల్వేల సంసిద్ధతపై కేంద్రమంత్రి అధికారులతో ఈరోజు దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రతి రైల్వే విభాగంలో అత్యవసర వార్ రూమ్స్ ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తుఫాను తర్వాత రైలు సేవలను త్వరితగతిన పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లల్లో అవసరమైన సామగ్రి, యంత్ర పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోనేలా సిబ్బందిని ఆదేశించాలని సూచించారు. ప్రయాణీకుల అసౌకర్యాన్ని తగ్గించడానికి రైల్వే కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మొంథా తీవ్ర తుఫాను ఈరోజు రాత్రి ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ సమీపంలో తీరందాటనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని, తీరం వెంబడి గంటకు 90 నుండి 100 కిలో మీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు... గరిష్టంగా 110 కిలోమీటర్ల వేగాన్ని సంతరించుకుంటాయని వాతావరణ శాస్త్రవేత్త స్వర్ణాళి మజుంధార్ వివరిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

జైపూర్-ఢిల్లీ జాతీయ రహదారిపై ఈరోజు ఒక ప్రైవేట్ బస్సులో మంటలు చెలరేగిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, పన్నెండు మందికి తీవ్ర గాయాలయ్యాయి. రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లా మనోహర్‌పూర్ సమీపంలోని తోడి గ్రామంలో బస్సు కు హైటెన్షన్ విద్యుత్ తీగ తగలడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. గాయపడిన ప్రయాణీకులకు జైపూర్ లోని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బస్సు ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ నుండి షాపురాకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84,778 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 150 పాయింట్ల నష్టంతో 84,628 వద్ద ముగిసింది. నిఫ్టీ 29 పాయింట్ల లాభంతో 25,936 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 27 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =